## సుల్తాన్‌పూర్‌లో నేడు ప్రజా ఆశీర్వాద సభ

### హాజరు కానున్న సీఎం కేసీఆర్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 22 : మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్ ఎయిర్‌పోర్టు రోడ్డు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో గురువారం ఉదయం 10 గంటలకు ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సీఎం కేసీఆర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల అసోసియేషన్ నాయకులు, కుల సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. దాదాపు 50వేల పైచిలుకు ప్రజలు హాజరవనున్నట్లు తెలిపారు. సభకు వస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌టీయూ నాయకులు పి.గెల్వయ్య, నిరంజన్ తదితరులు

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

అంబర్‌పేట, నవంబర్ 22 : ఆటో కార్మికులకు పిట్‌నెస్ ఫీజును మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. బుధవారం బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేట డివిజన్ టీ టైమ్స్, రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి బీఆర్‌టీయూ సీనియర్ నాయకుడు పి.గెల్వయ్య, మోర శ్రీరాములు, మిర్యాల రవీందర్, బీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పోలె నిరంజన్ క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ వెంకన్న, నగేశ్, మాసాని మహేశ్, కాశన్న, మేడ యాదగిరి, వినోద్ చారి, శంకరన్న, సైదులు పాల్గొన్నారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు కానుకగా అంబర్‌పేటలో కాలేరు వెంకటేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.




హెచ్ఎండీఏ రూపొందించిన 'తెలంగాణ మర్చిపోయిన మెట్ల బావులు' పుస్తకం ముఖ చిత్రం

## 'తెలంగాణ మర్చిపోయిన మెట్ల బావులు'

### పుస్తకం రూపకల్పన

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చారిత్రాత్మక వారసత్వ సంపదగా ఉన్న మెట్ల బావులను పునరుద్ధరిస్తూ భావి తరాలకు భద్రంగా ఉండేలా హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో మెట్లబావుల్లోని పూడికలను తొలగించి, వాటిని స్వచ్ఛమైన నీటితో నిత్యం ఒక పర్యాటక ప్రదేశంగా ఉండేలా తీర్చిదిద్దామని రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ తెలిపారు. మన చారిత్రాత్మక వారసత్వ సంపదపై ప్రత్యేకంగా రాష్ట్రంలో 7 ఏండ్లపాటు అధ్యయనం చేసి 'తెలంగాణ మర్చిపోయిన మెట్ల బావులు' పుస్తకాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ డిజైన్ ఫోరం దీనిపై ప్రత్యేకంగా పరిశోధన చేసి వివరణాత్మకమైన సమాచారంతో రూపొందించిందని, త్వరలోనే ఆవిష్కరిస్తామని తెలిపారు. సుమారు 12 మంది రచయితలు రాసిన మెట్ల బావుల సమగ్ర సమాచారంతో పాటు 400లకు పైగా ఫొటోలు పుస్తకంలో ఉంటాయని వివరించారు.

# మహేశ్వరంలో ప్రగతి పరుగులు

**మౌలికవసతులకు పెద్దపీట**

- విద్య, వైద్యం, పర్యాటక రంగం, పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత
- కందుకూరులో రూ.175 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు
- నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో రూ.833 కోట్లతో అభివృద్ధి పనులు
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన రేడియంట్ కంపెనీలో ఓ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, రేడియంట్ కంపెనీ ప్రతినిధులు (ఫైల్)

బడంగ్‌పేట, నవంబర్ 22: మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తున్నది. ఐటీ కారిడార్‌కు కేరాఫ్‌గా మారబోతుంది. ఫార్మా సిటీ ఏర్పాటుతో ఆ ప్రాంతం రూపు రేఖలు మారుతున్నాయి. మెడికల్, లా, డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ అనేక కళాశాలలతో పాటు విద్య, వైద్యం, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో అగ్రగామిగా ఎదిగింది. మౌలిక వసతులు, ఆహ్లాదం కోసం పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ, యోగా కేంద్రాలతో ప్రకృతి సౌందర్యాన్ని తలపిస్తోంది. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ, మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ మంచినీరు సౌకర్యం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కింది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి బస్తీ దవాఖానలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఏర్పాటు చేశారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 52 కంపెనీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. రూ.6600 కోట్లతో శంషాబాద్ నుంచి కందుకూరు వరకు మెట్రో రైల్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో మంత్రి పి. సబితాఇంద్రారెడ్డి పరుగులు పెట్టిస్తున్నారు.



జిల్లెలగూడలో మన ఊరు – మన బడి కింద అభివృద్ధి చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల

### విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు..

నియోజకవర్గంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, జూనియర్ కళాశాల, బీసీ సంక్షేమ లా కళాశాల, జిల్లా గ్రంథాలయం, డైట్ కళాశాల, మైనార్టీ, ట్రైబల్ రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేశారు. మన ఊరు –మన బడిలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో రూ.32కోట్లతో మౌలిక వసతుల కల్పన, రూ.8 కోట్లతో వివిధ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు చేపట్టారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కళాశాల, బీసీ బాలుర, బాలికల కళాశాలలు, గిరిజన, మైనార్టీ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి చొరవ తీసుకున్నారు.

### బస్తీ దవాఖానల ఏర్పాటు

కందుకూరులో రూ.175 కోట్లతో మెడికల్ కళాశాలను ప్రభుత్వ సహకారంతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఏర్పాటు చేశారు. రూ.1200 కోట్లతో కొత్తపేటలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేయబోతున్నారు. మహేశ్వరంలో రూ. 6కోట్లతో ఐదు పడకలు ఉన్న ఆసుపత్రిని 50 పడకలుగా, రూ.10.7కోట్లతో జల్‌పల్లిలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 13 బస్తీ దవాఖానలు, 8 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

### రూ. 833 కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధి..

నియోజకవర్గంలో ఉన్న మున్సిపాలిటీల్లో ప్రభుత్వ సహకారంతో మంత్రి సబితారెడ్డి రూ.833 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.312కోట్లతో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, రూ.200 కోట్లతో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, రూ.233 కోట్లతో జల్‌పల్లి మున్సిపాలిటీ, రూ.88కోట్లతో తుక్కుగూడ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.



బడంగ్‌పేటలో ఏర్పాటు చేసిన రంగారెడ్డి జిల్లా గ్రంథాలయం

### ఐటీ కారిడార్‌గా మహేశ్వరం

మహేశ్వరం ఐటీ కారిడార్‌గా మారబోతుంది. వేల ఎకరాల్లో కందుకూరులో ఫార్మా సిటీ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం రూపు రేఖలు మారబోతున్నాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో రూ.250 కోట్లతో విజయ డైరీ ఏర్పాటు చేశారు. ఫాక్స్‌ఖాన్, విప్రో, అమేజాన్, రేడియంట్, చిరిపాల్, ఓరియంట్ ఎల్కట్రిక్,మలబార్ గోల్డ్, సకుర సోలార్ పవర్, ప్రీమియర్ ఎనర్జీస్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్, డిఫెన్స్ వంటి అనేక కంపెనీలను ప్రభుత్వ సహకారంతో మంత్రి సబితాఇంద్రారెడ్డి ఏర్పాటు చేశారు.

### సంక్షేమపథకాలతో లబ్ధి ..

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా వేలాది మందికి లబ్ధి చేకూర్చింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్ల ద్వారా ఇప్పటివరకు 29,927 మందికి 578 కోట్ల ఆర్థికం సహాయం అందజేశారు. రైతుబంధు ద్వారా 35,222 మందికి రూ.389 కోట్లు, కల్యాణ లక్ష్మి ద్వారా 11,158 మంది పేదింటి యువతులకు రూ.108 కోట్లు, షాదీముబారక్ ద్వారా 5113 మందికి రూ.51 కోట్లు అందజేశారు. గొర్రెల పంపిణీకి రూ.42.03 కోట్లు, మైనార్టీ కుటుంబాల్లోని పేదలకు రూ.1.31 కోట్లు, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 4232 మందికి 15.25 కోట్లు , చేపల పంపిణీకి రూ.5 కోట్లు ప్రభుత్వం అందజేసింది. నియోజకవర్గంలో ఆత్మగౌరవ భవనాలకు రూ.84 కోట్లు మంత్రి కేటాయించారు. 2029 మందికి కేసీఆర్ కిట్లు, 2 వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించింది. బీసీబంధు కింద రూ.3కోట్లు, దళితబంధు కింద రూ.10 కోట్లు ఇప్పటి వరకు అందజేశారు. 6532 మంది రైతులకు గాను 87.02 కోట్లను ప్రభుత్వం రుణమాఫీ చేసింది.

### మౌలికవసతులకు ప్రాధాన్యం

నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో ప్రభుత్వం అవృద్ధికి పెద్ద పీట వేసింది. సీడీపీ, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.45 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.17 కోట్లతో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ, రూ.280 కోట్లతో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి సౌకర్యం ప్రభుత్వం కల్పించింది. రూ.99.40కోట్లతో బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు జల్‌పల్లి మున్సిపాలిటీలో మురుగు నీటి రూపకల్పన కార్యక్రమాలు మంత్రి చేపట్టారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ నిధులు రూ.330కోట్లతో పట్టణ ప్రాంతాల్లో మంచి నీటి సౌకర్యం, రూ.3కోట్లతో రావిర్యాలలో క్రీడా ప్రాంగణంను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో రూ.40 కోట్లతో 11 చెరువులను సుందరీకరణ చేపట్టారు. రూ.83 కోట్లతో పల్లె ప్రగతి, రూ.41కోట్లతో పట్టణ ప్రగతి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రూ.1.50 కోట్లతో బట్టేల్ గుట్ట, రూ.1.40 కోట్లతో రాక్ గార్డెన్, రూ.60లక్షలతో మీర్‌పేటలో పురాతన బుర్జును తీర్చిదిద్దారు. రూ.10 కోట్లతో పురాతన దేవాలయాల అభివృద్ధి, రూ.14కోట్లతో పహాడీషరీఫ్ దర్గా రోడ్డు, రూ.450 కోట్లతో నియోజక వర్గంలో రోడ్లను అభివృద్ధి చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రూ.160.9 కోట్ల ప్రత్యేక నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రూ.8 కోట్లతో మోడ్రన్ దోబీఘాట్స్, రూ.16 కోట్లతో సమీకృత మార్కెట్లు ఏర్పాటు చేశారు.

### అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ , ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేశా. నియోజకవర్గాన్ని విద్యా హబ్‌గా, ఐటీ కారిడార్‌గా మార్చబోతున్నాం. ఐటెక్ సిటీని తలదన్నే విధంగా మారబోతోంది. అనేక కంపెనీలు వచ్చాయి. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. అర్బన్ పార్కుల అభివృద్ధి, చెరువులు కబ్జా కాకుండా సుందరీకరణ చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నాం. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నాం. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని పనులు చేస్తున్నాం. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నాం. మురుగు నీటి సమస్య, ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నాం.

*- విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి*